క్లుప్తంగా

పేదలకు రగ్గులు పంపిణీ



బోధన్: పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని పేదలకు సీనియర్ సిటిజన్స్ ఫోరం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఫోరం డివిజన్ అధ్యక్షుడు మురహరి, కార్యదర్శి బండారు ముత్తయ్య, కోశాధికారి కాకయ్య, ప్రతినిధులు సాయిలు, వీరేశం, నర్సింలు, రాజేశ్వర్, ఆలయ చైర్మన్ అశోక్‌కులకర్ణి పాల్గొన్నారు.

ముగిసిన జాతర ఉత్సవాలు



వేల్పూర్: మండలంలోని పడగల్‌లో ఆదిమల్లన్న స్వామి జాతర ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నాగవెల్లి నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అగ్గు దేవేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అగ్నిగుండంలో నడిచారు.

కంప్యూటర్ వితరణ



బాల్కొండ: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అంజయ్య కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ప్రత్యేకాధికారిణి భవాని, కబడ్డీ గంగాధర్, శివశంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పెర్కిట్(ఆర్మూర్): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన ఇర్ఫాన్ కుటుంబానికి సిద్ధివినాయక మహిళ సంఘం సభ్యులు గురువాం 80 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీ డీ గంగామణి, పల్లవి, పద్మ, శిరీష, వాణి, జమున తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులకు బ్యాంకు సేవలపై మేనేజర్ రాంచందర్ అవగాహన కల్పించారు. కిడ్డీ బ్యాంకు ఉపయోగాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నమ్మకముంటే లక్ష్యసాధన సులభం

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థులు తమపై తమకు నమ్మకం పెట్టుకొని ముందుకు సాగితే లక్ష్య సాధన సులభమవుతుందని విజయ సాయి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏ అమర్నాథ్ అన్నారు. గురువారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం అవగాహన కల్పించారు. పరీక్షలకు భయపడకుండా ప్రణాళిక తయారు చేసుకొని దానికి అనుగుణంగా చదువుకుంటే విజయం తథ్యమని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

వేల్పూర్: మండలంలోని వాడి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం చెన్నయ్యను స్కూల్‌లో గురువారం ఘనంగా సన్మానించారు. స్కూల్‌కు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాసిద్, మండల పీఆర్టీయూ అధ్యక్షుడు అంకం నరేశ్, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లయ్య, ఉపాధ్యాయులు ఓంకార్ రతన్, లింబగిరి స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్

డొంకేశ్వర్(ఆర్మూర్): ఓటు హక్కుపై చైతన్యాన్ని పెంచేందుకు గురువారం డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారి, ఇతర సిబ్బంది నియామకం, పోలింగ్ సరళి, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రుద్రూర్: మండలంలోని రాణంపల్లిలో దక్షిణముఖ సంజీవని ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన గురువారం గణపతిపూజ, హోమం, చండీహవనం, జలాధివాస హవనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజాకల్యాణ మండపంపై పట్టింపేది?

- లక్షలు వెచ్చించినా నిరుపయోగంగానే..
- రూ. 50 లక్షలతో నిర్మాణం
- అవగాహన లోపమే కారణమా?



కమ్మర్‌పల్లిలో నిర్మించిన ప్రజా కల్యాణ మండపం

కమ్మర్‌పల్లి: పేద, మధ్య తరగతి ప్రజల కోసం మండల కేంద్రంలో నిర్మించిన ప్రజా కల్యాణమండపం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షల సీడీపీ నిధులతో మండల కార్యాలయాల పరిధిలో ప్రజాకల్యాణ మండపాన్ని నిర్మించారు. పేద, మధ్య తరగతి ప్రజలు తక్కువ ఖర్చు తో కల్యాణ మండపంలో శుభకార్యాలను జరుపుకోవచ్చనే ఉద్దేశంతో కేజీబీవీ పక్కన ఐదు ఎకరాల ఖాళీ స్థలంలో రెండు నిర్మాణాలను చేపట్టారు. ఒక టి శుభకార్యాల కోసం రెండోది భోజనాల కోసం నిర్మించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన తండ్రి స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి జ్ఞాపకార్థం రూ.2లక్షలు వెచ్చించి వంట సామగ్రి, కుర్చీలు, ఫ్యాన్లను అందజేశారు.

గతేడాది ఆయనే మండపాన్ని ప్రారంభించి, నిర్వహణ బాధ్యతలను స్థానిక గ్రామపంచాయతీకి అప్పగించారు. ఒక్కో శుభకార్యానికి రూ.5వేలు అద్దెగా నిర్ణయించారు. కానీ మండపం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు కల్యాణ మండపంలో ఒక్క శుభకార్యం కూడా జరగలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు కళ్యాణమండపంపై అవగాహన లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో గదుల తలుపులను దుండగులు తొలగించారు. కరెంటు స్విచ్ బోర్డులను ధ్వసం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వంట సామాను, కుర్చీలు, ఫ్యాన్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి దాపురించింది. మండపంపై అవగాహన లేకో మరే ఇతర కారణాలో గానీ, లక్షలు వెచ్చించి నిర్మించిన కల్యాణమండపం నిరుపయోగంగా మారింది. లక్షల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసంతో ఉన్నాం



శంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తుందనే విశ్వాసంతో ఉన్నామని పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్ అన్నారు. సీపీఎస్ రద్దు, మూడు డీఏల మంజూరు, 317 జీవో, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నామని అన్నారు. సాలూరా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో యూనియన్ మండల శాఖ అధ్వర్యంలో సభ్యులు, ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. పీఆర్టీయూ సాలూరా మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డి థామస్, రవి, సాయిలు, ప్రతినిధులు లక్ష్మణ్, ఎస్‌కే నిజాముద్దీన్, సుధారాణి, హెచ్‌ఎం మంజూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్టూడెంట్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన, మాక్ పోలింగ్, హోలోగ్రామ్, ఫుడ్‌మేళా, హెల్త్ క్యాంప్‌లను తిలకించారు. హోలోగ్రామ్ ప్రదర్శన చూపరులను ఆకర్షించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్‌కౌసర్, ఎంఈవో నాగ్‌నాథ్, నాగయ్య, కౌన్సిలర్లు శ్రీకాంత్‌గౌడ్, పిట్ల సత్యం, వలియొద్దీన్, ఖదీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు సామాజిక భద్రత



బోర్గాంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

రెంజల్(బోధన్): దేశంలోని అణగారిన వర్గాలకు సామాజిక భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నదని ఎంపీడీవో శంకర్, జెడ్పీటీసీ విజయ అన్నారు. మండలంలోని సాటాపూర్, బోర్గాం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఎఖార్‌పాషా, వాణి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. అర్హులై ఉండి పథకాలను వినియోగించుకోని వారు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రుక్మిణి, ఉపసర్పంచ్ ఫె రోజొద్దీన్, ఎంపీవో గౌస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి, సాటాపూర్ ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీనారాయణశాస్త్రి, వైద్య, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

ఆర్మూర్ టౌన్/రుద్రూర్ : ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్‌ను అవమానించిన ఎంపీలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్మూర్, రుద్రూర్‌లో వారు నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీ కళ్యాణ్‌బెనర్జీ ఉపరాష్ట్రపతిని అవమానిస్తూ మిమిక్రీ చేయడం, ఆ దృశ్యాలను రాహుల్‌గాంధీ సెల్‌ఫోన్‌లు చిత్రీకరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆర్మూర్‌లో నిర్వహించిన నిరసనలో బీజేపీ సీనియర్ నాయకుడు పుప్పాల శివరాజ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, దొండి ప్రకాశ్, కౌన్సిలర్ సాయి , రుద్రూర్‌లో పార్టీ నాయకుడు బైండ్ల బాల్‌రాజు, ఓబీసీ విభాగం కార్యదర్శి సుధాకర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆలపాటి హరికృష్ణ, ఎముల గజేందర్, నాయకులు వడ్ల సాయినాథ్, తోట శంకర్, కృష్ణం రాజు, గణేశ్, వినోద్‌కుమార్, గంగాధర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పండ్ల దుకాణాల తొలగింపు



పండ్ల దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలను మున్సిపల్, ఆర్టీసీ అధికారులు పోలీసుల సమక్షంలో గురువారం తొలగించారు. గత కొన్ని రోజులుగా పండ్ల వ్యాపారులు రోడ్డును అక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు పండ్ల దుకాణాలను తొలగించామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. రోడ్డును ఆక్రమిస్తే జరిమానా విధించడంతో పాటు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దుకాణాల తొలగింపు సమయంలో ఎటువంటి గొడవలు జరుగకుండా సీఐ సురేశ్‌బాబు పర్యవేక్షించారు. గతంలో సైతం ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని పండ్ల దుకాణాలను తొలగించామని అధికారులు తెలిపారు.

అత్యవసర సేవలకు ఏర్పాట్లు



ఆర్మూర్‌టౌన్: దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్మూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో కరోనా కేసులకు సంబంధించి వైద్య సేవలందించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆస్ప త్రి సూపరింటెండెంట్ నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా ఆక్సిజన్ సహిత పడకలు, ఐసొలేషన్ వార్డులు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచామన్నారు. ఏ పరిస్థితిలోనైనా అత్యవసర సేవ లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్‌ఎంవో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్లు అమృతరామ్‌రెడ్డి, సుమంత్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నందిపేటకు అయోధ్య రామయ్య అక్షింతలు



నందిపేట్ (ఆర్మూర్): అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠాపనను పురస్కరించుకొని పంపిణీ చేసిన అక్షింతలు గురువారం నందిపేట మండల కేంద్రానికి చేరాయి. కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జనవరి 1నుంచి 15వ తేదీ వరకు గడపగడపకు అక్షింతలను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. అక్షింతలతో పాటు మందిర ప్రారంభానికి సంబంధించిన కరపత్రాలు, హనుమాన్ చాలీసా పత్రాలు వచ్చాయన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి అంగన్‌వాడీ కేంద్రంలోని ఏడు నెలల చిన్నారులకు గురువారం అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ.. బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యలక్ష్మి పథ కం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి రోడ్డులో ఉన్న గురకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహాలక్ష్మి పథకంలో మార్పులు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

మోర్తాడ్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మార్పులు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆర్థికంగా స్థిరపడినవారు, ఎక్కువ వేతనం తీసుకునే మహిళలకు ఉచిత ప్ర యాణం వల్ల ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువ ఉందని వివరించారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారిని మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కోరారు. ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.3వేల భృతి ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉమేశ్ మహారాజ్, ఇందూర్ రాజు, రాము, రాజేశ్వర్, సందీప్, రణధీర్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం మోస్రా, కోటగిరి, చందూర్, వర్ని, పోతంగల్, రుద్రూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇప్పటి వరకు బాన్సువాడ నియోజక వర్గంలో 15వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆర్థికసాయంతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని, ఇస్తారో లేక పథకాన్ని నీరు గారుస్తారో చూద్దామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్నామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇంకా విధివిధానాలను ఖరారు చేయలేదన్నారు. ఆరు గ్యారంటీల్లో రెండు మాత్రమే అమలు చేస్తున్నదని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణసౌకర్యం కల్పించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు ధైర్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సొంత మండలాల్లో చెక్కులు అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీటీసీ కొట్టం మనోహర్

కోటగిరి (రుద్రూర్): ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను వేరే మండలానికి పిలిపించి చెక్కులు అందజేయడం సరికాదని, గ్రామాల్లోనే అందజేయాలని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. కోటగిరిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రుద్రూర్ మండల కేంద్రంలో చెక్కులు పంపిణీ చేయడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా మండలాల్లోనే చెక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోతంగల్, కోటగిరి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్, షాహీద్, ఎంపీటీసీ కొట్టం మనోహర్, నాయకులు వహీద్, హైమద్, భూమయ్య, సాయన్న అబ్బయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దళిత నేతలకు పదవులు హర్షణీయం



పాలాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

రుద్రూర్: కాంగ్రెస్ పార్టీ దళిత నేతలకు ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వంలో కీలక పదవులు ఇవ్వడం హర్షణీయమని కోటగిరి మాలమహానాడు అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి సాయిలు అన్నారు. గురువారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రముఖులు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్కకు, అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కు పదవులు ఇచ్చిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు మీర్జాపూర్ సాయన్న, ఎంపీటీసీ కొట్టం మనోహర్, కోటగిరి, పోతంగల్ కాంగ్రెస్ అధ్యక్షులు షాహిద్, పుప్పాల శంకర్, నాయకులు వహీద్, సాయిలు, దత్తాత్రి, అనిల్, బలరాం, దళిత నాయకులు పాల్గొన్నారు.

కూర్చునేది ఎలా?



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విరిగిన కుర్చీలు

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆవరణలో విరిగిన కుర్చీలు ఉండడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఎక్కడ కూర్చోవాలని అధికారులను అడుగుతున్నారు. తమ పని అయ్యేంత వరకు నిల్చునే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. విరిగిన కుర్చీలను తొలగించి నూతన కుర్చీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – ఆర్మూర్ టౌన్

రెస్టారెంట్ నిర్వాహకులపై ఫిర్యాదు



కార్యదర్శికి ఫిర్యాదు అందజేస్తున్న కాలనీవాసులు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని రాజనగర్ ప్రాంతంలో ఇళ్ల మధ్యన మురికి నీరు చేరడానికి కారణమైన అతిథి రెస్టారెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి సౌమ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. రెస్టారెంట్ నుంచి వచ్చే వ్యర్థమైన నీరు ఖాళీ స్థలాల్లోకి చేరడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దోమల బెడద ఎక్కువై పిల్లలు, మహిళలు రోగాలబారిన పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – సలార్ (తెలుగు)- 06.25
అక్వామెన్ (ఇంగ్లీష్-3డీ)- 10.00, 7.15
హాయ్ నాన్న (తెలుగు)- 12.45, 4.00
యానిమల్(తెలుగు)-10.00
స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 08.00, 11.35, 3.10, 06.45, 10.20
స్క్రీన్-3 – సలార్ (తెలుగు)- 08.30, 12.05, 3.40, 7.15, 10.50
స్క్రీన్-4 – సలార్ (తెలుగు)- 08.45
సలార్ (తెలుగు)- 12.20, 3.40, 7.00, 10.20